క్లుప్తంగా

రచయితల సేవలు చిరస్మరణీయం

పెనుగొలను(గంపలగూడెం): మండలంలోని పెనుగొలనులో ఆదివారం షిరిడిసాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో ఇరువురు ప్రముఖ రచయితల జయంతిని ఘనంగా నిర్వహించారు. రచయితలు రాచకొండ విశ్వనాథశాస్త్రి, పులికంటి కృష్ణారెడ్డి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలుగు సాహితీ ప్రపంచంలో వారు చేసిన సేవలు చిరస్మరణీయమని, వారి రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారన్నారు. గ్రంథాలయాధికారిణి వి.జ్యోతిర్మయి, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

పసుపు కొమ్ములతో అలంకరణ



గంపలగూడెం: అధిక శ్రావణ మాసం ఆదివారం సందర్భంగా స్థానిక ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా అమ్మవారికి పంచామృతాలతో, జలంతో అభిషేకం కనులవిందుగా చేశారు. నూతన వస్త్రాలు, పూలమాలలతో, పసుపుకొమ్ములతో అమ్మవారికి విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు జరిపారు. జట్ వికాస తరంగిణి అధ్యక్షురాలు కొల్లా కృష్ణకుమారి, మహిళలు పాల్గొన్నారు.

బోరు పంపుల ఏర్పాటుకు భూమిపూజ




ఈలప్రోలు(ఇబ్రహీంపట్నం): మండలంలోని ఈలప్రోలు గ్రామంలో నాలుగు బోరుపంపుల ఏర్పాటుకు ఎంపీపీ పాలడుగు జోత్స్న ఆదివారం భూమిపూజ చేశారు. గ్రామంలో తీవ్రమైన నీటి ఎద్దడి ఉందని గ్రామ సర్పంచి కరణం రంగారావు, ఎంపీటీసీ సభ్యురాలు కూరపాటి జయమ్మ ఎంపీపీ జోత్స్నకి గతంలో వివరించారు. దీనికి స్పందించిన ఆమె 7, 8, 10 వార్డులతో పాటు క్రైస్తవ శ్మశాన వాటికలో నాలుగు బోరుపంపుల ఏర్పాటుకు ఎంపీపీ నిధులు కేటాయించారు. బోరు పంపులు ఏర్పాటుకు శ్రీకారం చుట్టడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. పాలడుగు దుర్గాప్రసాద్, బండి వెంకటరావు, స్థానికులు పాల్గొన్నారు.

రేపు వేణుగోపాలస్వామి కల్యాణం

తిరువూరు: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నెమలి శ్రీవేణుగోపాలస్వామి మాస కల్యాణాన్ని ఆగస్టు 1న తిరువూరు శ్రీరస్తు కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి డీ శ్రీరామవరప్రసాదరావు ఆదివారం తెలిపారు. అధిక శ్రావణ శుద్ధ పౌర్ణమి నాడు సాయంత్రం 5 గంటలకు జరిగే ఈ కల్యాణ మహోత్సవంలో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

అక్కపాలెం రోడ్డుకు గండి



తిరువూరు: తిరువూరు-అక్కపాలెం వెళ్లే రహదారిలో మల్లమ్మ చెరువు వద్ద గండి పడింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. పడమటి వాగు, రాకెట్ సప్లయ్ చానల్‌లో నీరు ఉధృతంగా ప్రవహించడంతో రోడ్డు కొట్టుకుపోయింది. అక్కపాలెం, రఘునాథబంజరు తదితర గ్రామాల ప్రజలు తిరువూరుకు మునుకుళ్లమీదుగా చుట్టూతిరిగి రావలసి వస్తోంది. గండి పూడ్చి రాకపోకలు పునరుద్ధరించాలని ఆర్ అండ్ బీ అధికారులను గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం



చాట్రాయి: ప్రకృతి వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని మండలంలోని సోమవరం సర్పంచి ఉప్పాల శోభన్‌బాబు తెలిపారు. ఆదివారం స్థానిక గ్రామంలో పీఎంజేవై పథకం ద్వారా ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి ఉన్న రైతులకు నవ ధాన్యాలు, కూరగాయల విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అర్జున్, లక్ష్మి తదితరుల పాల్గొన్నారు.

అగ్రిల్యాబ్..ఫలితాలు అదుర్స్

- నత్ఫలితాలిస్తున్న ల్యాబ్
- టెస్టింగ్ ల్యాబ్‌తో రైతులకు భరోసా
- నియోజకవర్గ స్థాయిలో విత్తనాలు, ఎరువుల నాణ్యత పరీక్షలు
- నకిలీలకు చెక్



ఎ.కొండూరులో వైఎస్సార్ అగ్రి ల్యాబ్ భవనం

ఎ.కొండూరు: ప్రభుత్వం రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చిన వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్స్ సత్ఫలితాలను ఇస్తున్నాయి. అన్నదాతలు నకిలీ విత్తనాలతో మోసపోకుండా వైఎస్సార్ టెస్టింగ్ ల్యాబ్ భరోసా కల్పిస్తుంది. రైతులకు మేలైన విత్తనాలు అందాలనే ఉద్దేశంతో వ్యవసాయాన్ని మరింత ప్రోత్సాహించి అధిక దిగుబడులు సాధించేందుకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను పరీక్షించేందుకు డాక్టర్ వైఎస్సార్ అగ్రిటెస్టింగ్‌ల్యాబ్ ఎంతో ఉపయోగపడుతోంది.

నియోజకవర్గంలో..

ఈ ఏడాది నియోజకవర్గ స్థాయిలో సాగు చేస్తున్న పంటలు మిర్చి 30 వేల ఎకరాలు, పత్తి 20 వేల ఎకరాలు, వరి 32 వేల ఎకరాల్లో సాగుకు సిద్ధంగా ఉన్నాయి. ఈ ల్యాబ్ నియోజకవర్గ స్థాయిలో ఎ.కొండూరులో ఏర్పాటు చేశారు. గంపలగూడెం, విస్సన్నపేట, తిరువూరు మండలాల రైతులందరూ వీటి సేవలు పొందవచ్చు.

క్వాలిటీ కంట్రోల్ యాప్‌లో..

రైతులు పరీక్షల కొరకు తీసుకువచ్చిన విత్తనాలను, ఎరువులను ప్రత్యేకంగా క్వాలిటి కంట్రోల్ యాప్ అభివృద్ధి చేశారు. ల్యాబ్‌లో పరీక్షించిన ఫలితాలను తారుమారు చేయటానికి వీలు లేకుండా లెబరేటరీలో ఆటోమేషన ఏర్పాటు చేశారు. టెస్టింగ్ రిపోర్టులు వాటంతటవే సిస్టమ్‌లో నమోదు అవుతాయి. రైతులు షాపులకు వెళ్లినప్పుడు బ్యాచ్ నంబర్ చెక్ చేసుకుంటే చాలు. నాణ్యత సర్టిఫికెట్ ఉందో లేదో తెలిసి పోతుంది. రైతులు తమ సొంత విత్తనాల నాణ్యత ఈ ల్యాబ్‌లో ఉచితంగా పరీక్షించుకోవచ్చు. విత్తనాల శాంపిళ్లు ల్యాబ్‌లో అందజేస్తే వాటిని పరీక్షించి నాణ్యతను నిర్ధారిస్తారు. విత్తనాలు, పురుగు మందుల కంపెనీలు అడ్డదారులు తొక్కకుండా ఇలాంటి ఏర్పాట్లు చేశారు.



ల్యాబ్‌లో విత్తనాలను పరీక్షిస్తున్న అధికారులు

అధికారులు సేకరించిన నమూనాలు..

రాష్ట్ర స్థాయిలో ఆయా మండలాల వ్యవసాయశాఖ అధికారులు ఫెర్టిలైజర్స్ షాపులకు వెళ్లి విత్తనాలు, ఎరువుల శాంపిల్స్ తీసి రాష్ట్ర స్థాయిలో ఉన్న తాడేపల్లి, విశాఖపట్నం, అమరావతి, తిరుపతి డివిజనల్ కోడింగ్ సెంటర్‌లకు పంపిస్తారు. ఆ సెంటర్ల నుంచి ఇక్కడి ల్యాబ్‌కు 248 విత్తనాల నమూనాలు వచ్చి ఉన్నాయి. వీటి ఫలితాలను వెల్లడించారు.

శాతం తక్కువగా ఉంటే..

విత్తనాలు, ఎరువులు పరీక్షలు చేసిన తర్వాత ఇన్‌సైట్ యాప్‌ద్వారా ఆన్‌లైన్ చేయడంతో ఆయా మండలాల వ్యవసాయాధికారులకు చేరుతుంది. విత్తనాల మొలకశాతం, ఎరువుల పర్సంటేజీ తక్కువగా ఉంటే వ్యవసాయశాఖ అధికారులు ఆయా షాపులపై తగిన చర్యలు తీసుకుంటారు. ఈ ల్యాబ్‌లో 121 ఎరువుల నమూనాలకు పరీక్షలు చేయగా ఒక నమూనాలో పర్సంటేజీ తగ్గడంతో తిరస్కరించారు.

సద్వినియోగం చేసుకోవాలి..



నియోజకవర్గ స్థాయిలో రైతులు ఈఖరీఫ్ సీజన్‌లో సాగు చేస్తున్న విత్తనాలు ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేసి ఈ ల్యాబ్‌లో పరీక్షలు చేయించుకోవాలి. ఈ మండలంలో 47 మంది రైతులు విత్తనాలు శాంపిల్స్ తీసుకువచ్చారు. వీటిని పరీక్షించగా సరిపడ మొలకశాతం ఉన్నట్లు నాణ్యమైన విత్తనాలుగా నిర్ధారించాం. –కె.వెంకటేశ్వరరావు, ల్యాబ్ ఏఓ

నాణ్యమైన విత్తనాల మొలకశాతం ఇలా..

వరి	–80, శాతం
పత్తి	–75 శాతం
మిర్చి	–60 శాతం
వేరుశనగ	–70 శాతం
మొక్కజొన్న	–90 శాతం
సజ్జలు	–75 శాతం
మిరప	–60 శాతం

ల్యాబ్‌కు వచ్చిన 248 విత్తన నమునాల్లో సరైన మొలకశాతం ఉన్నాయని నిర్ధారించారు.

ఎరువుల్లో నాణ్యతాశాతం ఇలా..

యూరియా	–46 శాతం
20–20	–20 శాతం
భాస్వరం	–20 శాతం
నత్రజని	–20 శాతం
సల్ఫర్	–3 శాతం
డీఏపీ రకం..	–46 శాతం
నత్రజని	–18 శాతం
భాస్వరం	–46 శాతం
పొటాష్	–60 శాతం
ఎస్ఎస్‌పీ సూపర్:	
భాస్వరం	–16 శాతం
సల్ఫర్	–11 శాతం
1026– నత్రజని	–20 శాతం
భాస్వరం	–26 శాతం
పోటాష్	–26 శాతం ఉండాలి.

నేడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో 'స్పందన'

నూజివీడు: పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 31న ఉదయం 10గంటల నుంచి స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సబ్‌కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలను స్పందనలో అందజేస్తే వాటిని గడువులోగా పరిష్కరిస్తా మన్నారు. డివిజన్‌లోని ప్రజలు స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సబ్‌కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

నేడు శాంతి ర్యాలీ

నూజివీడు: మణిపూర్‌లో దారుణ మారణ హోమాన్ని, హింసాకాండను నిరసిస్తూ ఈనెల 31న మధ్యాహ్నం 3గంటలకు నూజివీడు ఐక్య క్రిస్టియన్ సమాఖ్య ఆధ్వర్యంలో రాజీవ్ సర్కిల్ నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు శాంతి ర్యాలీ ఉంటుందని నిర్వాహకులు ఆదివారం తెలిపారు. మణిపూర్ బాధితులు, ప్రజలకు మద్దతుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్లు, ప్రజాస్వామ్యవాదులు, నూజివీడు ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన తెలియజేయాలని కోరారు.

రేపటి నుంచి ధార్మిక కార్యక్రమాలు

ఆగిరిపల్లి(నూజివీడు): టీటీడీ ఆధ్వర్యంలోని హిందూ ధర్మ ప్రచార పరిషత్ నేతృత్వంలో మండలంలోని ఈదర, బొద్దనపల్లిలో ఆగస్టు ఒకటో తేదీ నుంచి 5వ తేదీ వరకు ధార్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఏలూరు జిల్లా సభ్యులు బసవరాజు సుబ్బారావు ఆదివారం తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 6.30 గంటలకు కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, దీనిలో ధార్మిక ఉపన్యాసం, భజన కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. ఈదరలోని పార్వతీ సమేత మోక్ష అమరలింగేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

దేశ శాంతికి వారధులం కావాలి

ముసునూరు: భారతావనిలో శాంతి స్థాపన, పునరుద్ధరణకు మనమంతా వారధులం కావాలని దళిత కథోలిక సంఘాల మండల కన్వీనర్ ఫాదర్ జోసెఫ్ తంబి పిలుపు నిచ్చారు. భారతదేశంలో శాంతి వర్ధిల్లాలని కాంక్షిస్తూ దళిత కథోలిక క్రైస్తవ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మానవహారం, ర్యాలీ కార్యక్రమాలను ఆదివారం ముసునూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్సీఎం చర్చి వద్ద నుంచి సెంటర్ మీదుగా పోలీస్‌స్టేషన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రముఖ వక్త, ఉపాధ్యాయుడు బెనర్జీ మాట్లాడుతూ శాంతి, అహింసా మార్గాల ద్వారా స్వాతంత్ర్యం సాధించిన తొలి దేశం మనదేనన్నారు. అటువంటి దేశంలో హింసను ప్రేరేపించడం సహించరాని విషయమన్నారు. శాంతి వర్ధిల్లాలని కోరుతూ తెల్ల బెలూన్లను, పావురాలను ఎగురవేశారు. క్రైస్తవులు, మహిళలు, చిన్నారులపై జరుగుతున్న దాడులను నిలిపివేసేలా చర్యలు చేపట్టాలని కోరుతూ ఎస్‌ఐ ఎం.కుటుంబరావుకు వినతిపత్రం అందజేశారు. ఎంపీటీసీ చీలి లక్ష్మి అర్లప్ప, ఆర్‌సీఎం ఫాదర్లు నిర్మల్, ప్రవీణ్, జేమ్స్, సుమిత్, ప్రేరణాలయ సిస్టర్లు సుధారాణి, జాన్సల్, ఉపదేశకులు వెంకటేశ్వరరావు, లాజరస్, విశ్వాసులు, భక్తులు పాల్గొన్నారు.



ముసునూరులో ప్రపంచ శాంతి కోరుతూ ర్యాలీ నిర్వహిస్తున్న ఫెలోషిప్ ప్రతినిధులు

మణిపూర్ ఘటనలకు పాలకులే కారణం

ఎమ్మెల్సీ లక్ష్మణరావు

తిరువూరు: మణిపూర్ మారణహోమానికి కేంద్రప్రభుత్వ వైఖరితో పాటు మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వమే కారణమని శాసనమండలి సభ్యులు కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సత్య కాలేజీలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ×మణిపూర్ సంఘటనలకు కారకులు, కారణాలు¿ అనే అంశంపై బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సంకురాత్రి జనార్ధనరావు అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి పాలకులు మారణహోమం సృష్టిస్తున్నారని ఆరోపించారు. మైతీ తెగకు రిజర్వేషన్ కల్పిస్తూ కేంద్రప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులతో కుకీలు, నాగాలు తమ రిజర్వేషన్లకు అన్యాయం జరుగుతుందని ఆందోళన చెందుతున్నారన్నారు. సామాజిక అసమానతలు పెరగడానికి కేంద్రప్రభుత్వ నిర్ణయం దోహదపడిందని అన్నారు. ఇదే అదనుగా మత ఘర్షణలు ప్రేరేపించడానికి కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరోక్షంగా కృషి చేస్తున్నాయని ఆరోపించారు. దేశంలోని ప్రధాన రాజకీయ పార్టీలు సైతం మణిపూర్లో మహిళలపై జరుగుతున్న అమానుషాలపై నోరెత్తకపోవడం గమనార్హమన్నారు. ఈ ఘటనలకు కేంద్రమే పూర్తి బాధ్యత వహించాలన్నారు. జనవిజ్ఞానవేదిక, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కార్యదర్శులు గంగాధర్, వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తిరువూరు సదస్సులో మాట్లాడుతున్న లక్ష్మణరావు

మద్ది నాగావళి మృతికి ఘన నివాళులు

నివాళులర్పించిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

పుట్రేల (విస్సన్నపేట): మాజీ ఏఎంసీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి సతీమణి నాగావళి శనివారం ఉదయం మృతి చెందగ అంతిమ యాత్ర ఆదివారం నిర్వహించారు. అంతిమయాత్రలో ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి, ఎమ్మెల్సీ ఎం.అరుణ్‌కుమార్‌లు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే దిరిశం పద్మజ్యోతి, లిడ్క్యాప్ డైరెక్టర్ కోనేరు సత్యప్రియ, మైలవరం ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు లాంతాంతీయాకుమారి తదితరులు నాగావళి భౌతిక కాయం వద్ద నివాళులఅర్పించారు. మాజీ ఏఎంసీ చైర్మన్‌ను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, జెడ్పీటీసీ భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, గ్రామ సర్పంచ్ కారుమంచి స్వాతి, ఎంపీటీసీలు ఎన్ అంజిరెడ్డి, జి.నాగేశ్వరరావు, మాజీ వైస్‌ఎంపీపీ ఓలేటి దుర్గారావు, నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ పార్టీనాయకులు అంతిమ యాత్రలో పాల్గొన్నారు.



మాజీ ఏఎంసీ చైర్మన్ సతీమణి అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే రక్షణనిధి

ఆర్ అండ్ బీ రోడ్డు మరమ్మతుల పరిశీలన

పెనుగంచిప్రోలు: గ్రామంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సమీపంలో మక్కపేట నుంచి పెనుగంచిప్రోలు వచ్చే ప్రధాన రహదారికి భారీ వర్షాలకు పెద్ద గుంతలు ఏర్పడి రాకపోకలకు అంతరాయం కలిగింది. దీంతో ఆదివారం సర్పంచి వేల్పుల పద్మకుమారి యుద్ధప్రాతిపదికన గ్రావెల్‌తో గుంతలు పూడ్చించారు. మరమ్మతు పనులను స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పరిశీలించి సర్పంచ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాలు తగ్గిన తరువాత రహదారిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో జగ్గయ్యపేట ఏఎంసీ చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు వేల్పుల రవికుమార్, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు మరమ్మతు పనులు పరిశీలిస్తున్న విప్ ఉదయభాను, పక్కన సర్పంచి పద్మకుమారి

వాహనాల తనిఖీ



ఆగిరిపల్లి(నూజివీడు): మండలంలోని నూగొండపల్లి అడ్డరోడ్డు సమీపంలో ఆదివారం ఎస్‌ఐ నంబూరి చంటిబాబు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాల ధ్రువపత్రాలు, వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్ తదతర వాటిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించి వాహనాన్ని నడపాలన్నారు. మైనర్లు, డ్రైవింగ్ లైసెన్స్ లేనివారు వాహనాన్ని నడిపేటప్పుడు ప్రమాదం సంభవిస్తే వాహనం యజమానిపై కూడా కేసు నమోదు చేస్తామన్నారు. వాహనదారులందరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు.

వ్యక్తులు అదృశ్యమైతే ఫిర్యాదు చేయాలి

నూజివీడు: ఎవరైనా వ్యక్తులు అదృశ్యమైన వెంటనే ముందుగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, వారు పట్టించుకోకపోతే ఎస్పీకి ఫిర్యాదు చేయాలని సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెద ఖాసీం అన్నారు. మండలంలోని గొల్లపల్లిలో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆదివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జడ్జి మాట్లాడుతూ ప్రస్తుతం సోషల్ మీడియా ప్రభావం వల్ల అనేక అనర్థాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఎక్కువగా యువతులు కనిపించకుండా పోతున్నారని, దీనికి సోషల్ మీడియా ఒక కారణమన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించాలనే దృష్టితో అక్రమ మార్గాలను ఎన్నుకుంటున్నారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. నూజివీడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా ద్వారా ఇటి పనులకు, అవయవ వ్యాపారానికి, వ్యభిచారానికి ఉపయోగిస్తున్నారన్నారు. ప్రలోభాలకు లోను కాకుండా ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్‌ఐ తలారి రామకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెద ఖాసిం

నూతన పాలకవర్గం ఎన్నిక

నందిగామ: పట్టణంలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ నూతన పాలకవర్గ ఎన్నిక ఆదివారం ఆలయ ప్రాంగణంలో జరిగింది. న్యాయవాది గోపు వెంకట శ్రావణ్ కుమార్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అనంతరం జరిగిన ఎన్నికలో ఆలయ పాలకవర్గ అధ్యక్షుడిగా మారం వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా వనమా నరసింహారావు, కోశాధికారిగా ఊటుకూరు సత్యనారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారిని పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

భక్తులకు అసౌకర్యం కలుగనివ్వం

పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ వారి ఆలయం వద్ద భక్తులకు ఎటువంటి అసౌకర్యం రానివ్వమని ఆలయ ఈఓ కె.రమేష్‌నాయుడు, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ వరదకు మునేరులోని పైపులైన్లు కొట్టుకుపోయాయన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తక్షణం వాటర్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచటంతో పాటు, కేశ ఖండనశాల, టాయిలెట్ బ్లాక్‌ల వద్ద ప్రత్యేకంగా ప్లాస్టిక్ డ్రమ్ములు ఏర్పాటు చేసి ట్యాంకర్లతో నింపుతున్నామన్నారు. పైపులైన్ శాశ్వత పరిష్కారానికి త్వరలో చర్యలు చేపడతామని చెప్పారు.

2న చిల్లకల్లు-జగ్గయ్యపేట ఫోర్‌లేన్ రోడ్డు ప్రారంభం

జగ్గయ్యపేటఅర్బన్: ఆగస్టు 2 వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి జగ్గయ్యపేటలో పర్యటించనున్నారని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో పార్టీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, మున్సిపల్ కౌన్సిలర్ కొలగాని రాము, పార్టీ ప్రచార విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు మోరె వినోద్ తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. ఆగస్టు 2 వ తేదీన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను జన్మదినోత్సవం రోజున ఉదయం 11 గంటలకు చిల్లకల్లు-జగ్గయ్యపేట మధ్య సుమారు 5 కి.మీ మేర రూ.14 కోట్లతో ఏర్పాటుచేసిన ఫోర్ లేన్ రోడ్డును మంత్రి దాడిశెటి రాజా, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం సేవా కార్యక్రమాల్లో భాగంగా స్థానిక పార్టీ నియోజకవర్గ కార్యాలయం వద్ద రాజన్న ఉచిత భోజన క్యాంటీన్‌ను అతిథులు ప్రారంభిస్తారని తెలిపారు. స్థానిక ఉక్కు కళావేదికలో విజయవాడ మణిపాల్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని(క్యాన్సర్, గుండె, జనరల్ మెడిసిన్) ప్రారంభిస్తారని తెలిపారు. నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల సోషల్ మీడియా కన్వీనర్ శ్రీనివాస బ్రహ్మం, నాయకులు శేషం ప్రసాద్, పాటి సాంబ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



నందిగామ: రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని పట్టణ సీఐ హనీష్ సూచించారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు ఆదివారం సాయంత్రం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి రౌడీషీటర్‌పై ప్రత్యేక నిఘా ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ సత్ ప్రవర్తనతో ఉండాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. అవసరమైన విభాగాలకు పోయి జైలుపాలు కావద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ పండు దొర, సిబ్బంది పాల్గొన్నారు.